క్లుప్తంగా

దాసాంజనేయుడి హుండీ ఆదాయం రూ.11.32 లక్షలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. 11 లక్షల 32 వేల 381 రూపాయల నగదు సమకూరింది. 21 అమెరికన్ డాలర్లు వచ్చాయి. ఆలయ ప్రాంగణంలో దేవదాయ, ధర్మదాయశాఖ ఉన్నతాధికారులు, భక్తుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరిగింది. నాలుగు నెలల ఎనిమిది రోజులకు ఈ ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు.

డాక్టర్ తారకప్రసాద్‌కు ఐఎస్‌ఏ సత్కారం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మూడు దశాబ్దాల పాటు ఈఎస్ఐలో ఎనస్థీషియన్‌గా సేవలు అందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్‌ను ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్(ఐఎస్ఏ) నగర శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎనస్థీషియన్లు పాల్గొని డాక్టర్ తారక ప్రసాద్ సేవలను కొనియాడారు. రోగులకు సేవలు అందించడంతో పాటు, అసోసియేషన్‌లో కూడా పలు కీలక పదవులు అలంకరించి వన్నె తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఏ నగరశాఖ కార్యదర్శి డాక్టర్ రావెల దివ్య, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కీర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ శ్రీదేవితో పాటు, అసోసియేషన్ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ గేరా కిరణ్ కుమార్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ విభాగం ఆధ్వర్యంలో చిన్నారులపై లైంగిక దాడులు నివారణ, పోక్సో చట్టంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ జి.మాధవినాయుడు పర్యవేక్షణలో ప్రభుత్వాస్పత్రి పుష్కర హాలులో ఈ సదస్సు జరిగింది. ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం సిబ్బంది, డైస్ సిబ్బంది, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు, బాలల సంరక్షణ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలలపై లైంగిక దాడులు నివారణ అమల్లో ఉన్న పోక్సో చట్టంపై అవగాహన కలిగించారు. ఈ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సూచించారు.

నేడు ఉచిత ఫిజియో వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం స్టార్ ఫిజియో హాస్పిటల్‌లో శుక్రవారం హోలీని పురస్కరించుకుని ఉచిత ఫిజియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు న్యూరో ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఎం.ప్రభుదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

తయారీ కంపోస్ట్‌పోస్ట్

- నిరుపయోగంగా కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్
- మరమ్మతులు చేపట్టని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న రైతులు



పాయకాపురం రైతుబజార్లో నిరుపయోగంగా వున్న కంపోస్టు యూనిట్

పాయకాపురం(విజయవాడరూరల్): రైతుల ప్రయోజనార్థం లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన కంపోస్ట్ ఎరువుల తయారీ యూనిట్ నిరుపయోగంగా పడి ఉంది. విజయవాడ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు అలసత్వంతో ఈ యూనిట్ మూలకు చేరింది. ఇటీవల సంభవించిన బుడమేరు వరదల్లో కొన్ని రోజుల పాటు ఈ యూనిట్ నీటమునిగింది. ఫలితంగా తుప్పుపట్టి పాడైపోయే పరిస్థితికి చేరింది.

రూ.10 లక్షలతో కొనుగోలు

రాష్ట్ర విభజన అనంతరం 2016లో రూ.10 లక్షలతో కంపోస్టు ఎరువుల తయారీ యూనిట్‌ను కొనుగోలు చేసి పాయకాపురం రైతు బజారులో ఏర్పాటు చేశారు. ఆ యూనిట్ వానకు తడవకుండా, ఎండలకు ఎండకుండా ఉండేందుకు రూ.1.80 లక్షలు ఖర్చు చేసి ప్రత్యేకంగా ఒక షెడ్డు కూడా నిర్మించారు. పాయకాపురం రైతు బజారు నుంచి వచ్చే కూరగాయల వ్యర్థాలను వినియోగించి ఈ యూనిట్‌లో కంపోస్టు ఎరువు తయారు చేస్తారు. ఎరువు తయారైన తర్వాత ప్రత్యేకంగా కిలో, అర కిలో చొప్పున ప్యాక్ చేస్తారు. ఈ ఎరువును కూరగాయలు, పూల తోటల సాగు కోసం రైతులకు, ఇంటి పెరటిలో కూరగాయలు, పూల మొక్కలు పెంచే వారికి 'నో ప్రాఫిట్, నో లాస్' పద్ధతిలో విక్రయించేందుకు ఈ యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

అధికారుల నిర్లక్ష్యం

రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ఈ యూనిట్‌ను నిర్వహించడంలో మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. వారి తీరు కారణంగానే అనతి కాలంలోనే ఆ యూనిట్ మూలనపడిందని రైతులు పేర్కొంటున్నారు. రైతుల పేరు చెప్పి లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేశారే తప్ప ఆశించిన మేర ప్రయోజనం చేకూరలేదని వారు అంటున్నారు. పాడైపోయిన ఆ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టి కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు ఉపయోగ పడేవిధంగా వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



పాయకాపురం రైతు బజార్లో మరమ్మతులకు నోచుకోక కంపోస్ట్ ఎరువుల తయారీ ప్లాంట్ నిరుపయోగంగా పడివుంది. మార్కెటింగ్ శాఖ అధికారులు దీనికి రిపేరు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి. అప్పుడే కంపోస్టు ఎరువును ఉపయోగించి కూరగాయలను పండించే రైతులకు తక్కువ ధరకు నాణ్యమైన ఎరువు అందుబాటులోకి వస్తుంది.

-కుప్పం శివ బాలాజీ వరప్రసాద్,
జిల్లా వినియోగదారుల పరిరక్షణ కౌన్సిల్ హెల్ప్ లైన్ ట్రస్ట్ చైర్మన్

మరమ్మతులు చేపట్టాలి

పాయకాపురం రైతు బజార్ నుంచి వచ్చే కూరగాయల వ్యర్థాల ద్వారా తయారుచేసే కంపోస్టు ఎరువుల యూనిట్ నిరుపయోగంగా మారింది. దీనిని ఇలానే వదిలేస్తే లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. అధికారులు తక్షణం స్పందించి వర్మి కంపోస్టు యూనిట్‌కు మరమ్మతులు చేపట్టాలి. అప్పుడే నాణ్యమైన ఎరువు రైతులకు తక్కువ ధరకు లభిస్తుంది.

– కె.నర్సారెడ్డి, నున్న

వినియోగంలోకి తీసుకొస్తాం

మరమ్మతులకు గురైన కంపోస్ట్ ఎరువుల యూనిట్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. దానికి మరమ్మతులు చేపట్టి రైతులకు ఉపయోగపడే విధంగా వినియోగంలోకి తీసుకొస్తాం.

– డి.మంగమ్మ,
ఏడీఎం, మార్కెటింగ్ శాఖ

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



బోరును పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఈ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నగరంలోని అన్ని ప్రాంతాల్లో బోర్లను పునరుద్ధరించాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఒకటో డివిజన్ ప్రాంతంలో మధురానగర్ పప్పుల మిల్ సెంటర్, రైల్వే ట్రాక్ ఏరియా, గుణదల నుంచి రామవరప్పాడు వెళ్లే సర్వీస్ రోడ్, కార్మెల్ నగర్, వీఎంసీ ఎంప్లాయీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు పారిశుద్ధ్య నిర్వహణలోపం, దోమల సమస్యపై ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ఎంప్లాయీస్ కాలనీ అభివృద్ధి చేయాలని రోడ్లను, స్ట్రీట్ లైట్లను, తదితర మౌలిక వసతులు అన్ని కల్పించి ఆరు నెలల్లో ఆ కాలనీని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ను వదిలి వెళ్లే ప్రసక్తే లేదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజీవ్ గాంధీ హోల్ సేల్ మార్కెట్ తమకు అనుకూలమైన ప్రాంతమని, దీనిని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని మార్కెట్ వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు బత్తుల దుర్గారావు స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా వేల మందికి ఉపాధి కల్పిస్తున్న రాజీవ్ గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద రైల్వే అధికారులు గడ్డర్లు ఏర్పాటుచేసి వ్యాపారులు, కార్మికులు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని వ్యాపారాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. మహాత్మాగాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో బత్తుల దుర్గారావు మాట్లాడారు. అయ్యదేవర కాశేశ్వరరావు మార్కెట్లో హోల్ సేల్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు 40 ఏళ్ల కిందట రాజీవ్ గాంధీ పార్కు సమీపంలో తమకు షాపులు నిర్మించి వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. నాటి నుంచి హోల్ సేల్ వ్యాపారం ఆ ప్రాంతం నుంచి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. రెండేళ్ల నుంచి రైల్వే అధికారులు మార్కెట్‌కు అడ్డంగా గడ్డర్లు ఏర్పాటు చేసి కూరగాయల వాహనాలను లోపలికి రానీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో సుమారు 67 షాపులున్నాయని, 1500 మంది కార్మికులు పనిచేస్తున్నారని, మొత్తంమీద మూడు వేల మంది ఈ మార్కెట్ ఆధారంగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు అల్లు మురళీ, వెన్నం రత్నారావు, ఆకిరి శ్రీను, షేక్ ఖయ్యూం, సుంకర శివాజీ, పైడి వెంకటేశ్వరరావు, బూర్ల రమేష్, శేషు, భూషణం, గుండపు శ్రీహరి పాల్గొన్నారు.

బిట్ కాయిన్ పేరుతో మోసం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే లాభాలు వస్తాయంటూ నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన బళ్లా శ్రీనివాస ప్రసాద్ గతంలో వ్యక్తిగత పనిమీద వైజాగ్ వెళ్లాడు. అక్కడ కాంబత్తుల కృష్ణ సతీష్‌తో పరిచయమైంది. బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే లాభాలు వస్తాయని కృష్ణ సతీష్ నమ్మబలికాడు. దీంతో శ్రీనివాసప్రసాద్ రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బుతో బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే బాగా లాభాలు వచ్చాయని కృష్ణ సతీష్ చెప్పాడు. అయితే డబ్బులు ఇవ్వకుండా శ్రీనివాస ప్రసాద్‌ను మోసం చేశాడు. తన డబ్బులు ఇప్పించాలని కాకినాడకు చెందిన పులి ప్రతాప్‌ను శ్రీనివాస ప్రసాద్ ఆశ్రయించగా అతను చంద్రశేఖర్ అనే వ్యక్తి వద్దకు తీసుకెళ్లాడు. మూడు నెలల పాటు శ్రీనివాస ప్రసాద్‌ను అతను తన వద్దే ఉంచుకుని డబ్బులు ఇప్పించకుండా తిరిగి పంపించేశారు. దీంతో తాను మోసపోయానని తెలుసుకొని భవానీపురం పోలీసుల స్టేషన్‌లో శ్రీనివాసప్రసాద్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మాదక ద్రవ్యాలతో భవితకు ముప్పు



మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపరాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వల్ల భవిష్యత్తుకు ముప్పు ఏర్పడుతుందని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ వి.స్వరూప రాణి హెచ్చరించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. స్వరూపరాణి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం యువతను పెడదారిని పట్టిస్తున్న రుగ్మతల్లో డ్రగ్స్ ముందంజలో ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, రీజనల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ రామ్మోహన్ రెడ్డి, డిస్టిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ బ్రహ్మం, యూత్ వెల్ఫేర్ ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ లక్ష్మీశ్రావణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యారావుపేటలోని అర్చన కిడ్నీ అండ్ స్కిన్ కేర్ హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. తొలుత అర్చన కిడ్నీ అండ్ స్కిన్ కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ గొరిపర్తి శశిధర్ మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామన్నారు. ఈ ఉచిత శిబిరం శుక్ర, శనివారాల్లోనూ కొనసాగుతోందన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు విజయవాడ నగర ప్రజలు ఉచిత కిడ్నీ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థలో టీడీపీ ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి, ఏపీ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరావు, డాక్టర్ అర్చన మాధురి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై నిరంతర పోరాటం



జెండా ఆవిష్కరణచేస్తున్న మహిళా సంఘం నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళల సమస్యలపై మహిళా సంఘం నిరంతర పోరాటం చేస్తోందని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ, రత్న కుమారి అన్నారు. మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 60, 61, 64 డివిజన్లలో మహిళా సంఘం సీనియర్ నాయకులు బసవలక్ష్మి, శివమ్మ, పిచ్చమ్మ చేతుల మీదుగా గురువారం జెండావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలపై హింస బాగా పెరిగిందని, దీనిని అరికట్టడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవటం లేదని విచారం వ్యక్తంచేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పి, బడ్జెట్‌లో మహిళలకు మొండిచెయ్యి చూపారని విమర్శించారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు సీహెచ్.అరుణ, దేవీకుమారి, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, లత, సావిత్రి, స్పోర్ట్స్ కమిటీ నాయకులు పద్మ, దుర్గాభవాని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పైపులరోడ్డు ఆహ్వానం కల్యాణ మండపం వద్ద జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ గాయపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. అంబాపురం గ్రామానికి చెందిన మోలె నరసింహారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. బుధవారం ఆహ్వానం కల్యాణ మండపం రోడ్డు వద్ద నడిచి వెళ్తుండగా ఓ ఆటో వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు గాయాలైన నరసింహారెడ్డిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

విజయవాడలీగల్: బైక్ చోరీ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల 21 రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. 2024 జూన్ 20వ తేదీ రాత్రి మొగల్రాజపురంలోని ఓ ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు మాచవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానంతో బుడమేరు మధ్యకట్ట ఏరియాకు చెందిన కందుల విఘ్నేశ్వరరావు అలియాస్ విఘ్నేష్‌ను పీటీ వారెంటుపై అదుపులోకి తీసుకొని విచారించి, కోర్టులో హాజరుపరచారు. అతనిపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల 21 రోజుల జైలుశిక్ష విధిస్తూ ఒకటో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్.కరీముల్లా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ఉమావతి వాదనలు వినిపించారు.

సత్తాచాటిన ఎస్ఆర్ఆర్ విద్యార్థిని



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.సృజల మేరీస్ స్టెల్లా కాలేజీ నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 'లిఫ్ట్'లో పోస్టర్ ప్రజెంటేషన్ చేసి మొదటి బహుమతిని గెలుచుకుంది. విద్యార్థులు ఎం.శివలీల, ఎం.శ్రీనివాస్ ఈ పోటీల్లో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో సృజల, శివలీల, శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగ అధిపతి డాక్టర్ సయ్యద్ వజీహతహసీన్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు సృజలను అభినందించారు.

61వ డివిజన్‌లో ప్రజా చైతన్యయాత్ర



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 61 డివిజన్ శాంతినగర్ వాటర్ ట్యాంక్ ఏరియాలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్రజాచైతన్య యాత్ర జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిగురుపాటి బాబురావు ప్రజలతో మమేకమై వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వరద సహాయం ఈనాటికీ అందలేదని పలువురు బాబూరావు వద్ద మొరపెట్టుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ ఉన్న తమకు రూ.25 వేలకు బదులు రూ.10 వేలే పడ్డాయని, అదేమని అధికారులను అడిగితే అంత కుమించి ఏమీ చేయలేమని సమాధానం చెబుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. వరద సహాయం కోసం అనేక మార్లు అర్జీలు పెట్టామని, అయితే పట్టించుకున్న వారే కరువయ్యారని వాపోయారు. సచివాలయం, తహసీల్దార్ ఆఫీస్, కలెక్టర్ కార్యాలయంలో వరద సాయం కోసం దరఖాస్తులు చేసినప్పటికీ ఫలితం లేదని పలువురు ప్రజలు సీపీఎం బృందానికి వివరించారు. తాము ప్రజలకు అండగా ఉంటామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని ఈ సందర్భంగా బాబూరావు హామీ ఇచ్చారు.

పరీక్షలకు టాటా.. ఇక ఇంటి బాట





ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ముగిశాయి. ఇన్నాళ్లూ పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. కార్పొరేట్ కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు హాస్టళ్లను ఖాళీచేసి ఇంటిబాట పట్టారు. తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు తరలి వచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో బస్టాండ్, రైల్వే స్టేషన్లు కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







గ్లకోమాను అశ్రద్ధ చేయొద్దు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీటి కాసులు (గ్లకోమా)ను నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంధత్వం ఏర్పడే ప్రమాదం ఉందని జీజీహెచ్ నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ పి.ప్రభాకరశాస్త్రి హెచ్చరించారు. ప్రపంచ గ్లోకోమా వారోత్సవాలను పురస్కరించుకుని జీజీహెచ్‌లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభాకరశాస్త్రి గ్లకోమాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇ.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శిరీష పాల్గొన్నారు.